
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 28-01-2026
Medchal - Malkajgiri | Wednesday 28-01-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 242
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 242 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





2 లో

## మదర్ ఆఫ్ డీల్స్

- భారత్ తో ఈయూ మధ్య కుదిరిన చారిత్రాక వాణిజ్య ఒప్పందం
- భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు
- టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది

**న్యూ డిల్లీ, జనవరి 27 :**

భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు.



## ముస్తాబైన మేడారం

- మేడారం జాతరకు సర్వం సిద్ధం
- AI డ్రోన్లు, భారీగా భద్రతా సిబ్బంది
- 4 వేల ప్రత్యేక బస్సులు - 1,418 ఎకరాల్లో పార్కింగ్

**వరంగల్, జనవరి 27 :**

మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరకు తెలంగాణ ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. జనవరి 28 బుధవారం నుంచి జనవరి 31 శనవారం వరకూ నాలుగు రోజుల పాటూ జరిగే జాతరకు భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు అన్ని శాఖల అధికారులు. సౌకర్యాలు కల్పన ఓవైపు..నిర్మాణ పనులు మరోవైపు నిర్వహించారు. ఆధునిక సాంకేతికత వినియోగిస్తూ ఏర్పాట్లు పూర్తిచేశారు.

జనవరి 28 బుధవారం సారలమ్మ రాక
జనవరి 29న సమ్మక్క ఆగమనం
జనవరి 30న గద్దెలపై తల్లులకు మొక్కులు చెల్లింపు
జనవరి 31న దేవతల వనప్రవేశం...

2 లో




2 లో

## అంత పెద్ద శిక్షా..
### ఆవేదనలో ఖమ్మం టీచర్

**ఖమ్మం, జనవరి 27 :**

ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెం ప్రభుత్వ పాఠశాల ఇంగ్లీష్ టీచర్ గౌతమి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వ్యవహారం వివాదాస్పదమైంది. పాఠశాల పనివేళల్లో పాఠాలు చెప్పకుండా.. ప్రైవేటు సంస్థల బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ వీడియోలు తీసినందుకు అధికారులు ఆమెను సస్పెండ్ చేశారు.




2 లో

# పురపోరుకు నగారా..!

- తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఓటు వేయనున్న 52.43 లక్షల మంది
- ఫిబ్రవరి 11న ఎలక్షన్... 13న రిజల్ట్స్

**హైదరాబాద్ :**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల విడుదలైంది.7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలకు నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి రాణి కుముదిని వెల్లడించారు. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని... 13న ఎన్నికల కౌంటింగ్ జరగనుందని తెలిపారు. జనవరి 27 నుంచి 30 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది అని పేర్కొన్నారు. ఇకపోతే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఓటు హక్కు వినియోగించు కోనున్నారని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి రాణి కుముది పేర్కొన్నారు.

**ఫిబ్రవరి 11న పోలింగ్**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు

...మిగతాది 2 లో



## సింగరేణిలో అవినీతి వెలికితీశాక పాలకుల్లో వణుకు మొదలైంది

- తెలంగాణ సీఎం కోల్ మాఫియాకు నాయకుడిలా మారిపోయారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, జనవరి 27 :**

సింగరేణిలో అవినీతి వెలికితీశాక పాలకుల్లో వణుకు మొదలైందని. తెలంగాణ సీఎం కోల్ మాఫియాకు నాయకుడిలా మారిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు బొగ్గు గనుల కేటాయింపులపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఫిర్యాదు చేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ..

...మిగతాది 2 లో



## మేడారం జాతర..
### శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

**హైదరాబాద్ :**

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ త్యాగానికి, ధిక్కారానికి ఆదివాసీ దేవతలు సమ్మక్క సారలమ్మలు ప్రతీకలని కేసీఆర్ అన్నారు. కొంగు బంగారమై, కోరిన కోరికలు తీర్చే తమ ఇలవేల్పులకు మొక్కులు తీర్చుకునేందుకు, కోట్లాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం జాతర కుంభమేళాను తలపిస్తూ ఆధ్యాత్మిక కేంద్రమై కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాజాల సబ్బండ కులాల సంస్కృతి, సంప్రదాయాలకు పదేండ్ల బీఆర్ఎస్ పాలన పెద్దపీట వేసిందని కేసీఆర్ పేర్కొన్నారు. గోదావరి లోయ పరీవాహక ప్రగతితో సమాంతరంగా సాగిన ఆధ్యాత్మిక అభివృద్ధిని ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. అన్ని రంగాల్లో ప్రగతి తిరిగి పుంజుకొని, తెలంగాణ ప్రజలు సుభిక్షంగా జీవించేలా దీవించాలని సమ్మక్క సారలమ్మ దేవతలను కేసీఆర్ ప్రార్థించారు.

### పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం..
## పడగొట్టినవి నిలబెడదాం

- 10 జిల్లాల్లో 20కు పైగా ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి ప్రతిపాదనలు
- పూర్వోదయ నిధులతో సమగ్రాభివృద్ధి
- గ్రామీణ రహదారుల నెట్ వర్క్, లాజిస్టిక్స్ అభివృద్ధిపై దృష్టి
- రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యానరంగ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష



2 లో

**అమరావతి :**

గ్లోబల్ మార్కెట్లో డిమాండ్ కు అనుగుణంగా ఉద్యాన ఉత్పత్తులు పండించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. దానికి అనుగుణంగా అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పతులను పండించడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం సూచించారు.



## గుంపు మేస్త్రికీ ప్రధాన గూఢచారియే సంతోష్ రావు

- ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి వెపన్స్ ఇవ్వాలి.. కవిత

**హైదరాబాద్ :**

నిజామాబాద్ లో గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. సౌమ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కవిత మాట్లాడుతూ.. గుంపు మేస్త్రికీ ప్రధాన గూఢచారియే సంతోష్ రావు.

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## మదర్ ఆఫ్ డీల్స్

ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూరప్ కార్లు, యంత్ర పరికరాలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "ఈరోజు యూరప్, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు. యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్, యురోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ అంటోనియో లూయిస్‌తో కలిసి ఉమ్మడిగా మోదీ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. సోమవారమే దీనిపై ఒప్పందం కుదిరిందన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఇండియా ఈయూ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్షోభాన్ని నివారించడంలో సాయపడుతుందన్నారు. ఇది ఇండియా, యూరప్ ప్రజలకు అద్భుత అవకాశాలను కల్పిస్తుందని, ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై మన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని మోదీ అన్నారు. ప్రపంచ జీడీపీలో ఇండియాఈయూ వ్యాపార భాగస్వామ్య వాటా 25 శాతం ఉందని పేర్కొన్నారు. ఇండియాఈయూ మధ్య 1962 నుంచి నుంచి వ్యాపార, వాణిజ్య ఒప్పందం కొనసాగింది. ఇది 2004 నుంచి వ్యూహాత్మకంగా మారింది. ఈ రెండు దశాబ్దాలలో ఎదురైన అనేక అవరోధాలకు తాజా ఒప్పందం చెక్ పెట్టబోతుంది. ఇప్పుడు కుదిరిన ఈ ఒప్పందం అంతర్జాతీయంగా కీలకంగా మారనుంది. ట్రంప్ టారిఫ్‌లు, రష్యాఉక్రెయిన్ యుద్ధం వంటి అంశాలు అంతర్జాతీయ మార్కెట్లను గందరగోళంలో నెట్టేశాయి. ఈ సమయంలో ఇండియాఈయూ ఒప్పందం అంతర్జాతీయ వాణిజ్యానికి సానుకూల సంకేతాల్ని అందిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇండియాకు ఈయూ అతిపెద్ద వ్యాపార భాగస్వామిగా ఉంది. ఈయూఇండియా మధ్య 2024, 25 మధ్య 136 బిలియన్ అమెరికన్ డాలర్ల వ్యాపారం జరిగింది. భారత తయారీ, క్లీన్ ఎనర్జీ, డిజిటల్ వంటి రంగాల్లో ఈయూ కంపెనీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మరోవైపు భారత ఐటీ కంపెనీలు, ఫార్మా వంటి సంస్థలు యూరప్‌లో సేవలందిస్తున్నాయి.

## ముస్తాబైన మేడారం

ఈ ఏడాది జాతరకు దాదాపు 2 కోట్లమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందనే అంచనాలతో ఏర్పాట్లు చేశారు అధికారులు. తెలంగాణ పోలీసు శాఖ ఈ ఏడాది మేడారం జాతర చుట్టూ 'డిజిటల్ కోట' ఏర్పాటు చేసింది. జాతర పరిసరాల్లో వేలాది CCTV కెమెరాలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ జోడించారు. ఇవి నేరగాళ్ల ముఖాలను గుర్తుపట్టడమే కాదు ..రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి కంట్రోల్ రూమ్ కి అలర్ట్ పంపిస్తాయ్. ఇందుకోసం అత్యాధునిక డ్రోన్లను, కెమెరాలతో కూడిన హీలియం బెలూన్లను ఉపయోగిస్తున్నారు. ఇవి ట్రాఫిక్ జామ్స్ , తొక్కిసలాట జరగకుండా ముందే హెచ్చరికలు జారీచేస్తాయ్. ఈ టెక్నాలజీని అందిపుచ్చుకుని 15వేలమంది పోలీసులు విధుల్లో ఉన్నారు మేడారం జాతర కోసం తెలంగాణలో వివిధ జిల్లాల నుంచి 4 వేల బస్సులను RTC నడుపుతోంది. ఈ బస్సులలోనూ మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంది. ఈ బస్సులు పార్కింగ్ చేసేందుకు 1,418 ఎకరాల విస్తీర్ణంలో 43 చోట్ల పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. మేడారంలో వన్ వే ఉంటుందిమేడారం జాతరకు లక్షల్ల మంది భక్తులు వాహనాల్లో తరలివస్తారు. ఈ మేరకు ట్రాఫిక్ నియంత్రణ సవాల్ గా మారే అవకాశం ఉంది. ఈ ఏడాది ఆ సమస్య లేకుండా సమీపంలో రోడ్లు, వంతెనల విస్తరణ చేపట్టారు. 100 కోట్లు వెచ్చించి...జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ , పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో మేడారానికి లింక్ అయి ఉన్న ప్రధాన రహదారులు అభివృద్ధి చేశారు. జాతరకు వచ్చే భక్తులు ముందుగా జంపన్నవాగులో స్నానమాచరించి వనదేవతలను దర్శించుకుంటారు. జంపన్నవాగు వద్ద ఘాట్లు మరమ్మతులు చేశారు. జాతర నాలుగు రోజులు భక్తుల రద్దీని నియంత్రించేందుకు , అమ్మవార్ల దర్శనం ప్రశాంతంగా జరిగేందుకు గద్దెల ప్రాంగణాన్ని విస్తరించారు. ఈ విస్తరణ కారణంగా ఒకేసారి 10 మంది అమ్మలను దర్శించుకోవచ్చుసమ్మక్క సారలమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులేమా వీఐపీలు అని మంత్రి సీతక్క అన్నారు. భక్తులంతా కుటుంబ సమేతంగా వచ్చి తల్లులను దర్శించుకోవాలని, క్రమశిక్షణతో ఉండాలని పిలుపునిచ్చారు. కొందరి అత్యుత్సాహం కారణంగా తోపులాటలు జరుగుతాయని..ఈ ఏడాది అలాంటివి లేకుండా అందరూ... నిర్వాహకులు సూచించిన మార్గాల్లో వెళ్లాలని, ప్రతి భక్తుడు స్వీయ నియంత్రణతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాల బారిన పడొద్దని విజ్ఞప్తి చేశారు.


## పాలకుల్లో వణుకు మొదలైంది

ఏ బొగ్గుగనిలో లేని నిబంధన ఇక్కడనే ఎందుకు పెట్టారంటే ఇంతవరకు సమాధానం రాదన్నారు. నిజంగనే 2018 నుంచి 2024 వరకు ఈ నిబంధనను కేంద్రప్రభుత్వం సిఫారసు చేసి ఉంటే.. ఆ రోజున్న బీఆర్ఎస్ ప్రభుత్వం తరపున అన్ని టెండర్లను కూడా మేం పారదర్శకంగా పిలిచినం. అందుకే ఆ రోజు అన్నీ మైనస్ టెండర్లు వచ్చినయ్. ఎస్టిమేటివ్ కంటే తక్కువ ఖర్చుకే సింగరేణికి డబ్బులు ఆదా చేస్తూ ఆ రోజు జరిగిన మాట వాస్తవమా..కాదా..? అని ప్రశ్నించారు. మరి ఆ రోజు టెండర్లలో లేని షరతు మీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సైట్ విజిట్ సర్టిఫికేషన్ విధానం ఎందుకు పెట్టారు...? ఎవరికి లాభం చేయడానికి పెట్టారు. అంటే ఇంతవరకు ప్రభుత్వంలోని బాధ్యులు ఏ ఒక్కరూ కూడా సమాధానం చెప్పడం లేదన్నారు కేటీఆర్ .202526లో నిజానికి జనవరిలో ఈ నిబంధనలు లేకుండా ఒక టెండరు చేశారు. జనవరిలో టెండరు వేస్తారు.. మళ్లీ వెంటనే ఆ టెండరు రద్దు చేశారు. టెండర్లలో ఈ నిబంధన లేకుండా ఆ రోజు మీరు టెండరు పిలిస్తే మైనస్ 7 శాతానికే పనిచేస్తామని (అంటే 100 రూపాయలకు ఎస్టిమేట్ చేస్తే 93 రూపాయలకే పని చేస్తామని) కాంట్రాక్టు సంస్థలు ముందుకొచ్చాయి. కానీ మీరు దాన్ని రద్దు చేశారు. ఈ నిబంధన పెట్టారు. దాని వల్ల తిరిగి మళ్లీ అదే ప్లేస్‌లో టెండర్ పిలిస్తే +12 (అంటే 100 రూపాయలకు అయ్యే పని 112 రూపాయలు) కావాలని చెప్పి సంస్థలు వచ్చిన మాట వాస్తవమా.. కాదా అని చెప్పాలని ప్రభుత్వాన్ని మేం డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ అన్నారు.

## పడగొట్టినవి నిలబెడదాం

10 జిల్లాలను ఉద్యాన రంగానికి కేంద్ర బిందువుగా చేపట్టే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. పూర్వోదయ, సాస్కీ, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఇదే సమయంలో సీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని... అలాగే తక్కువ నిధులను కేటాయిస్తే త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులను తొలుత చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గాలేరునగరి ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ దిశగా సుమారు 20కు పైగా ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అధికారులు వివరించారు. మొత్తంగా ఈ ప్రాజెక్టుల ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టు, అలాగే 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీళ్లు అందించవచ్చని అధికారులు సీఎంకు తెలిపారు. సీమ ప్రాజెక్టులతో పాటు... ఉత్తరాంధ్ర జిల్లాల్లో కూడా ప్రాజెక్టులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలవరం ఎడమ కాల్వ పనులు పూర్తి అయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్లవచ్చన్నారు. అప్పుడు పోలవరంవంశధార నదుల అనుసంధానం ప్రాజెక్టు చేపట్టవచ్చని సూచించారు. ఈలోగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని ప్రాధాన్యతల వారీగా నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# ఇంటింట సమ్మక్క సారక్కలు






మేరుగు రాజయ్య
దుద్దెనపల్లి, సైదాపూర్
9441 440 791

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో సమ్మక్క,సారక్కలకు సాకబోయని కుటుంబాలు అరుదుగా ఉంటాయి.మా చిన్నతనంల 1972 ప్రాంతంలో సమ్మక్క బంగారమమ్మా అంటూ (బెల్లం) పంచి పెడితే తీసుకోవడానికి భయపడేవారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తీసుకోవద్దని హితవు చెప్పేవారు.ఎందుకంటే,? బంగారం తీసుకుంటే సమ్మక్క సారక్కలు మన ఇంట్లో కూడా కొలువైతరని వివరణను ఇచ్చేవారు. కాని ఇప్పుడు ఇంటింట సమ్మక్క సారక్కలను కొలుస్తున్నారు. ఆరాధించి పండుగను చేసుకుంటున్నారు. రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమి (సమ్మక్కల పున్నం)నుండి నాలుగు రోజులు జాతర జరుగుతుంది.ఒకప్పుడు మేడారంలోనే జాతర జరిగేది.కాని ఇప్పుడు తెలంగాణలోని 612 రెవిన్యూ మండలాలలో

ఉన్న సమ్మక్క సారక్కల జాతరలకు లక్షల కుటుంబాలు పోయి మొక్కలు తీర్చుకుంటున్నారు.
ఇక ములుగు జిల్లా, తాడ్వాయి మండలం, మేడారంలో జరిగే జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్ గడ్,ఒడిశా రాష్ట్రాల నుండి దాదాపు 25 నుండి 35 లక్షల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.ఇది ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా వాసికెక్కింది. గిరిజన తల్లీబిడ్డలైన సమ్మక్క సారక్కలు నేడు ప్రజల ఆపదలను, కష్టాలను తీర్చే జనదేవతలుగా జనసామాన్యమైన ఆదరణకు పాత్రులవుతున్నారు. ప్రాచుర్యంలో మౌకిక కథనం ప్రకారం క్రీస్తు శకం 1260 1320 ల కాలంలో కాకతీయుల రాజ్యంలో ఇప్పటి జగిత్యాల జిల్లా పోలవాస గిరిజన ప్రాంతానికి మేడరాజు సామంత రాజుగా పాలించాడు. ఇతని మేనల్లుడైన పగిడిద్ద రాజు మేడారం గిరిజన ప్రాంతానికి సామంత రాజు. మేడరాజు కూతురు సమ్మక్కను ఇచ్చి వివాహం చేశాడు. వాళ్లకు జంపన్న, సారలమ్మ, నాగులమ్మలు జన్మించారు. కాలక్రమంలో మేడారం ప్రాంతం తీవ్ర కరువు కాటకాలకు గురై ప్రజలు బతకడమే కష్టమైంది. కాకతీయ రాజుకు కట్టవలసిన కప్పం(పన్ను) భారమైంది. తాండవించిన కరువు వలన ప్రజలు పన్నులు చెల్లించడం కష్టమవుతుందని కాకతీయ రాజైన ప్రతాపరుద్రుడిని పగిడిద్దరాజు వేడుకుంటాడు. దానికి రాజదిక్కారంగా భావించి సామంత రాజైన పగిడిద్దరాజుపై యుద్ధానికి ఆదేశిస్తాడు. ఇరువురుల మధ్య జరిగిన యుద్ధంలో పగిడిద్దరాజు, ఇతని అల్లుడు గోవిందరాజులు చనిపోతారు. కుమారుడు జంపన్నను చంపి సంపెంగ వాగు(నది)లో వేస్తారు. (కాని ప్రాచుర్యంలో మాత్రం నదిలో దుమికి ఆత్మహుతి చేసుకున్నాడని అంటారు. బహుశా అది వాస్తవం కాకపోవచ్చు.ఎందుకంటే ? గిరిజనులు నిండు నదిలో కూడా ఈదుతూ ప్రాణాలు దక్కించుకుంటారు. అదియుగాక మనిషి చనిపోయేంతగా నీళ్ల ప్రవాహం ఉండి ఉంటే కరువు తాండవించదు.) ఇక మిగిలింది సమ్మక్క, సారక్కలు. తల్లిబిడ్డలు మరియు చనిపోగ మిగిలిన గిరిజన సైన్యం. సమ్మక్క, సారక్కలకు కూడా యుద్ధ నైపుణ్యాలు, ధైర్యం, తెగువ, పోరాటపటిమ ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే?కాకతీయ సామ్రాజ్యం రాజైన గణపతిదేవుడికి కుమారులు లేనందున కుమార్తె అయిన రుద్రమదేవిని కాకతీయ సామ్రాజ్య పాలనకు రాజును చేశాడు. రుద్రమదేవి 1262 నుండి 1289 వరకు 27 సంవత్సరాలు పాలన చేసింది.రుద్రమదేవి ప్రభావం, పోరాట స్ఫూర్తి సమ్మక్క, సారక్కలపై కూడా ఉండే అవకాశం ఉంది.
మొత్తానికి సమ్మక్క, సారక్కలు యుద్ధ రంగంలోకి దిగి కాకతీయ సైన్యానికి ఎదురొడ్డి పోరాడారు.అట్టి పోరాటంలో సారక్క చనిపోయింది. తల్లి సమ్మక్క తీవ్ర గాయాలతో చిలుకల గుట్టకు పోయి అదృశ్యమైంది.తరువాత చెట్టు కింద పుట్ట దగ్గర "కుంకుమ భరణి"దొరికింది. తరువాత ప్రతాపరుద్రుడు సమ్మక్క సారక్కల ధైర్యసాహసాలకు ముగ్ధుడై పశ్చాత్తాపంతో కోయరాజులు కట్టవలసిన కప్పాన్ని మాఫీ చేశాడని చెపుతారు. గిరిజనుల/ఆదివాసీల చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే పగిడిద్దరాజు, జంపన్న, గోవిందరాజులు, సమ్మక్క సారక్కలు మరియు గిరిజన వీరుల మరణం నిజమని చెప్పక తప్పదు. వాళ్లకు రాజ్యాన్ని, మైదాన ప్రాంత దోపిడిని ధిక్కరించి పోరాడే చరిత్ర ఉంది.1836 1860 లలో రామ్ జీ గోండ్ నిజాం,బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశాడు. "మావ నాటె "!మావ రాజ్ "!! మా భూమిలో మా రాజ్యం అంటూ పోరాడారు.ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ లోని గిరిజన మ్యూజియానికి రామ్ జీ గోండ్ నామకరణంతో స్మరిస్తుంది.1855 1856 లలో ఇప్పటి జార్కండ్,బెంగాల్ లలో సంతాల్ ల తిరుగు బాటు జరిగింది.నాయకులైన సిడో ముర్మ, కన్హు ముర్ము లను బ్రిటీష్ పాలకులు "భోగ్నాదిహ్ గ్రామంలో బహిరంగంగా ఉరితీసింది. వీరి జ్ఞాపకార్థం ప్రభుత్వం జార్ఖండ్ లోని దుమ్కాలో విశ్వ విద్యాలయం పెట్టింది.అలాగే స్వాంత్రత్య సమరయోధులుగా ఆరాధిస్తున్నాము.18751900 లలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా, ఆదివాసీల హక్కుల కోసం పోరాడి అమరుడైన బిర్సా ముండాను "ధర్తీ పితామహుడుగా, భగవాన్ గా కొలుస్తున్నాము. బీజేపీ ప్రభుత్వం అయితే ప్రతి నవంబర్ 15 ను "జన జాతీయ గౌరవ్ దివాస్"గా జరుపుకోవాలని ప్రకటించింది. 1901 1940 లలో కొమురం భీమ్ నిజాం,బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడి "జల్ జంగల్, జమీన్, మా భూమి, మా అడవి, మా నీరు మాకు కావాలని పోరాటం చేశాడు. 1924 లో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా గాము గంటం దొర, గాము మల్లు దొర, 60 మంది గిరిజన పోరాటయోధులతో అటవీ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడారు.1915 లో రాణి గైడిన్ల్యూ నాగాలాండ్ లో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆమెను జైలులో కలిసినప్పుడు "రాణి(క్విన్)గా బిరుదు ఇచ్చాడు. ఆదివాసీలు ఆది నుండి పరాయీకరణకు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా మరియు అడవుల రక్షణకు తమ పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నారు.

అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొనసాగిన టి.అంజయ్య పాలనలో ఆదివాసీల హక్కులకై అదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లిలో సభ జరుపుకుంటున్న గిరిజనులపై జరిపిన పోలీస్ కాల్పుల్లో దాదాపు 13 మందికి పైగా గిరిజనులు చనిపోయారు.అదే కాంగ్రెస్ ప్రభుత్వం స్వరాష్ట్రం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారికంగా 2025 ఏప్రిల్ 20న "అమరవీరుల సంస్మరణ సభ జరిపి "తెలంగాణ పునర్నిర్మాణ సభగా పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఏవైనా విధానాలలో వలస దోపిడీకి పట్టం కడుతూనే ఉన్నవి. స్వదేశీ జ్ఞానాన్ని విస్మరించి వాణిజ్యకరించే విధానాలతో గిరిజన హక్కులను కాలరాస్తూ, అడవి సంపదను అమ్ముచున్నవి. 1970 నాటి "చిప్కో "ఉద్యమంలో అడవి సంరక్షణకై మహిళలే ముఖ్య పాత్ర వహించారు.చెట్టు చుట్టూ చేతులు చుట్టి,చెట్లను కౌగలించుకుని వాటిని నరికి వేయవద్దని ఎదురు తిరిగారు. ఆసియాలోనే పెద్ద సరస్సుగా పేరొందిన ఒడిశాలోని చిల్కా సరస్సు (ఉప్పు నీటి మడుగు) వాణిజ్య అభివృద్ధి నుండి రక్షించుకోవడానికి ఉద్యమాలు చేశారు.ఒడిశా గిరిజన షెడ్యూల్ ప్రాంతాలలోని "కాశీ పూర్ "బ్లాక్ లో 412 రెవిన్యూ గ్రామాలు,109 కుగ్రామాలు,20 గ్రామ పంచాయతీలతో భౌగోళికంగా 1,505.90 చదరపు కిలోమీటర్లు,2001 జనాభా లెక్కల ప్రకారం 1,21,044 మంది కాగా అందులో 61 శాతం గిరిజనులు,20 శాతం షెడ్యూల్డ్ కులాలు నివసించుచున్న ప్రాంతంలో "బాక్సైట్ నిక్షేపాలను తీయడాన్ని వ్యతిరేకించుచూ "కాశీపూర్ ఉద్యమం చేశారు. ప్రభుత్వాలు అడవులలో ఉన్న వనరులను పారిశ్రామీకరణ, అభివృద్ధి పేరుతో ఆదివాసీలను స్థానభ్రంశం చేస్తున్నారు. కాని ప్రభుత్వం గిరిజనుల యోగ క్షేమాలు,పునరావాసం, సంఖ్యను రాతపూర్వకంగా నమోదు చేయడం లేదు. "వాల్టర్ ఫెర్నాండెజ్" 1947 నుండి 2000 లలో అడవులలోని స్వస్థలాల నుండి స్థానభ్రంశం అయిన గిరిజనుల సంఖ్య 50 నుండి 60 మిలియన్లుగా 2005 నివేదికలో పేర్కొన్నాడు. ప్రాజెక్ట్ ల కింద వినియోగించిన 25 మిలియన్ల హెక్టార్ల భూమిలో దాదాపు 8 మిలియన్ల హెక్టార్ల భూమి అడవులు మరియు గిరిజన సంఘాలకు చెందినవని పేర్కొన్నారు. పగిడిద్దరాజు, జంపన్న గోవిందరాజులు సమ్మక్క సారక్కల అమరత్వానికి సాక్షిగా శాసనాలు కాని,లిఖిత ఆధారాలు కాని లేకపోవచ్చు. చరిత్రకారులు,స్వామీజీలు పురాణ గాథలుగా,కావ్య సంఘటనలుగా భావించవచ్చు.కాని సమ్మక్క సారక్కలు అడవి సంరక్షణ కొరకు,ఆదివాసీల హక్కుల గురించి జరిగిన పోరాటంలో అమరులైన వాస్తవాలను దాదాపు గత ఏడువందల సంవత్సరాలుగా స్మరించుకుంటూ వస్తున్నారు. కాకతీయుల సామ్రాజ్యం క్రీస్తు శకం 750 నుండి 1323 వరకు దాదాపు 573 సంవత్సరాలు పాలించారు. అలాగే డిల్లీ సుల్తాన్ లు కాకతీయులపై 1296 నుండి 1323 వరకు అయిదు సార్లు దండయాత్రలు చేసి ప్రతాపరుద్రుడిని బందీగా డిల్లీకి తీసుకపోయినట్లుగా శాసనాలు ఉన్నవి. కాని ప్రతాపరుద్రుడు మరణంపై బిన్నాభిప్రాయాలు ఉన్నవి.ప్రతాపరుద్రుడుని, కటకపాలుడుని, గన్నమ నాయుడుని,సేనానులను బందీగా తీసుకున్నారు. వరంగల్ లోనే ప్రతాపరుద్రుడు ఉంటే ప్రమాదమని భావించిన ఉలుగ్ ఖాన్ డిల్లీకి తీసుకువచ్చే బాధ్యతను ఖాదిర్ ఖాన్ ఖ్వాజా హాజీలకు అప్పజెప్పాడు.అయితే ప్రతాపరుద్రుడు మార్గమధ్యంలోనే కన్నుమూశాడు. దీనిని గ్రంథస్థం చేసిన షాంసీ సిరాజ్ ఆఫీస్ ప్రతాపరుద్రుడు ఎలా మరణించాడో నమోదు చేయలేదు. ముసునూరి ప్రోలయ నాయకుని క్రీస్తు శకం 1330 నాటి విలాస దాన పత్రంలో సుల్తాన్ సైన్యం ప్రతాపరుద్రుడిని బందీగా తీసుకువెళుతుండగా నర్మదా నది తీరంలోని "సోమోద్భవ" వద్ద కన్నుమూశాడని పేర్కొంది. క్రీస్తు శకం 1423లో రెడ్డిరాణి వేయించిన "అనితల్లి కలువచేరు తామ్ర శాసనంలో ప్రతాపరుద్రుడు స్వచ్ఛందంగా సహజ మరణం చెందలేదని, భగవద్దైక్యం చెందాడని పేర్కొన్నారు. ఇలా మహారాజు మరణంపై స్పష్టత లేనప్పుడు గిరిజనుల/ఆదివాసీల పోరాటాలను, అమరత్వాన్ని ఎవరు రికార్డ్ చేస్తారనేది భౌతికవాదుల అభిప్రాయం.
గత వారం రోజులుగా సమ్మక్క, సారక్కలను ఇండ్లల్లో కొలుచుకుంటున్నారు. బెల్లం, కొబ్బరి కుడుక, ఒడి బియ్యం, పసుపు, కుంకుమ పోకలు, ఖర్జూర పండ్లు, జాకెట్ ముక్క, చీరె పెట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఎత్తు బంగారం(బెల్లం పంచదార) జోకి(వేమెంటు) ఇరుగు,పొరుగు కుటుంబాలకు పంచి పెడుచున్నారు. మేకను, లేదా కోడిని సాకబోసి బంధు మిత్రులతో ఆరగించుచున్నారు. 2026 జనవరి 28 నుండి 31 వరకు మేడారంలో మరియు తెలంగాణలోని గ్రామాలలో జరిగే జాతరలలో కూడా మొక్కులు తీర్చుకోవడానికి ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విప్లవ కవి గానం చేసినట్లుగా "ఆదివాసీల గుండెనమ్మా,అడుగుతున్న గొంతుతెరచి, అంతరించు అడవినమ్మా,చేతులెత్తి మొక్కుతున్న, నడకలు నేర్పిన పోరుకు,నెత్తురు తడిచిన త్యాగాలకి,నేడు తల్లడిల్లుతున్న గాయాలన్నీచెల్లిపోతున్న ఈనేలకి,"అమ్మని అడవమ్మని ఆదివాసుల కన్నతల్లిని" అంటూ మూలవాసులు కొలుచుకునే సమ్మక్క, సారక్కలను నేడు గ్రామ గ్రామాన ప్రజలు కొలుచుకుంటున్నారు.అంటే ప్రజలందరూ అడవులను, పర్యావరణాన్ని, జీవావరణాన్ని కాంక్షించుచున్నారు. ప్రభుత్వం కూడా సమ్మక్క, సారక్కల త్యాగాలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అడవులను, అడవులలోని ఖనిజాలను కార్పోరేట్, బహుళజాతి సంస్థలకు అమ్మకుండా పర్యావరణ, జీవావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరుకోవడం అత్యాశ కాదు. సహజ న్యాయం అవుతుంది. అట్టి కార్యాచరణకు పూనుకోవాలి.

## గుంపు మేస్త్రీకీ గూఢచారియే సంతోష్

కేసీఆర్ తినే ఇడ్లి సమాచారాన్ని కూడా రేవంత్ రెడ్డికి చేరవేసే వ్యక్తే ఆయన. తన గూఢచారికి శిక్షపడకుండా రేవంత్ రెడ్డి కాపాడుకునే పరిస్థితి ఉందని అన్నారు. కేసీఆర్ కు ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను దూరం చేసిన దుర్మార్గుడు. పోలీసులు నిజాయితీగా పనిచేస్తే సంతోష్‌రావుకు కచ్చితంగా శిక్ష పడుతుంది. నేను చెప్పిన దయ్యాల్లో మొదటి దెయ్యం సంతోష్ రావే. ఆయనకు హరీష్ రావు, కేటీఆర్ లు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావటం లేదు. గంజాయి, డ్రగ్స్ ముఠాలకు తగిన గుణపాఠం చెప్పాలి. సౌమ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తున్నా. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు దూరం కావటానికి కారణం సంతోష్ రావు. గద్దర్ లాంటి నాయకులు గంటలు గంటలు గేట్ బయట వేచి చూడటం, ఈటల లాంటి వారు బయటకు రావటానికి కూడా ఈ సంతోష్‌రావే కారణమని ఆరోపించారు. సంతోష్ రావును సిట్ పిలవటం మంచిదే. కానీ ఆయనకు శిక్ష పడటం అనుమానమే. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పోలీసులు తమ పని తాము చేయాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా. ఒక్కోసారి మన నీడ కూడా మన కళ్లను కప్పే పరిస్థితి వస్తుంది. ఉద్యమకారులను కేసీఆర్ కి దూరం చేసిన పాపం కచ్చితంగా ఈ దుర్మార్గుడికి తగులుతుందని అన్నారు. నిజామాబాద్ కు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి కొంచెం క్రిటికల్ గా ఉన్నప్పటికీ కాస్త ఇంప్రూమెంట్ ఉంది. ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్ ను చంపే ధైర్యం గంజాయి బ్యాచ్ చేసిందంటే ప్రభుత్వం అంటే వారికి ఏ మాత్రం భయం లేదని స్పష్టమవుతోంది. డ్రగ్స్, గంజాయి ఫ్రీ చేస్తామని ఈ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ దురదుష్టమేమిటంటే గ్రామాల్లో కూడా ఫ్రీ గా గంజాయి, డ్రగ్స్ దొరికే పరిస్థితి వచ్చింది. స్కూల్ లోకి కూడా గంజాయి, డ్రగ్స్ తీసుకొచ్చి పిల్లలను పాడు చేస్తున్నారు. దీని కారణంగా మా ఆడవాళ్లే బాధితులుగా మారే పరిస్థితి ఉంటుంది. గృహహింస ఘటనలు జరగటానికి డ్రగ్స్, గంజాయి కారణమవుతోంది. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మత్తు వదిలి డ్రగ్స్, గంజాయి మాఫియా పై వారి ప్రతాపం చూపాలి. అదే విధంగా ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి వెపన్స్ ఇవ్వాలి. వాళ్లకు ట్రైనింగ్ లో గన్ ఫైరింగ్ ఉంటుంది. కానీ వెపన్స్ ఇవ్వటం లేదని అన్నారు.

## పురపోరుకు నగారా..!

ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు.ఈ ప్రకటనతో, ఎన్నికలు జరిగే పట్టణాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. నామినేషన్ల స్వీకరణ జనవరి 28న ప్రారంభమవుతుంది. జనవరి 30 వరకు కొనసాగుతుంది. జనవరి 31న నామినేషన్ల స్క్రూటీ్ని ఉంటుంది. ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఫిబ్రవరి 11న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఇక బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించబడుతుంది. అవసరమైతే ఫిబ్రవరి 12న రీపోలింగ్ నిర్వహించబడుతుంది. ఫలితాలు ఫిబ్రవరి 13న ప్రకటించబడతాయి.
ఫిబ్రవరి 16న 116 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్ మరియు వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 7 కార్పొరేషన్లలో మేయర్ మరియు డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరగనున్నాయి అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రాణి కుముదిని పేర్కొన్నారు. ఇకపోతే ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,000 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2996 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు.ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రత కల్పించబడుతుందని తెలిపారు.

**నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల**

నోటిఫికేషన్ విడుదల: 28012026, నామినేషన్ల స్వీకరణ: 28.01 2026, నామినేషన్ల దాఖలుకు చివరి తేది:30012026, నామినేషన్ల పరిశీలన:31012026, నామినేషన్లపై అభ్యంతరాలు:01022026, అభ్యంతరాలపై పరిష్కారం:02022026, నామినేషన్ల ఉపసంహరణ గడువు:03.022026, బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల:03 022026, పోలింగ్: 11022026, రీపోలింగ్ 12022026, కౌంటింగ్:13022026 (ఉదయం 8 గంటల నుండి), మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలు సమరానికి సై అంటున్నాయి. ఈనెల 28న నోటిఫికేష్ విడుదల కావడం అదే రోజు నుంచి 30వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మంగా తీసుకున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఈ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాయి. మరోవైపు బీజేపీ సైతం పట్టుకోసం గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఇక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఇక తెలంగాణ రాజకీయం మరింత రసవత్తరంగా మారే అవకాశం లేకపోలేదు.

## అంత పెద్ద శిక్షా..

ఈ చర్యపై గౌతమి తీవ్ర భావోద్వేగానికి లోనవుతూ మరో వీడియో విడుదల చేశారు. 'నేనేమీ గంజాయి అమ్మలేదు, ఎవరినీ చంపలేదు.. తెలియక చేసిన తప్పుకు ఇంతలా ట్రోలింగ్ చేస్తారా?" అంటూ కన్నీరు మున్నీరయ్యారు. ఆత్మహత్య చేసుకోవాలన్నంత బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠినంగా ఉంటామని అధికారులు హెచ్చరించగా.. బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సోషల్ మీడియా మోజులో పడటం సరికాదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాల గదిని సోషల్ మీడియా వేదికగా మార్చుకున్నారనే ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయురాలు గౌతమి వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే కారణంతో విద్యాశాఖ అధికారుల నుంచి కఠిన చర్యలు ఎదుర్కొన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నవారు ఎలాంటి ప్రైవేటు వ్యాపార ప్రకటనల్లో నటించకూడదు. కానీ.. గౌతమి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పలు ప్రైవేటు విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ రీల్స్ చేశారనే ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా పాఠశాల పని వేళల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా సోషల్ మీడియా పనుల్లో నిమగ్నమవ్వడంపై ఉన్నతాధికారులు గతంలోనే ఆమెను హెచ్చరించారు. అయినప్పటికీ ఆమె తీరులో మార్పు రాకపోవడంతో.. విధి నిర్వహణలో క్రమశిక్షణారాహిత్యం కింద ఆమెను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల పోరుకు బీజేపీ సిద్ధం

- బీజేపీ అభ్యర్థులను గెలిపించండి షాద్ నగర్ ను అభివృద్ధి చేస్తాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భువనగిరి జిల్లా ఇంచార్జినెల్లి శ్రీవర్ధన్ రెడ్డి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య
- షాద్ నగర్ పట్టణం లో ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న శ్రీవర్ధన్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, జనవరి 27 :**

రాబోయే మున్సిపల్ ఎన్నికల సన్నద్ధం కోసం షాద్ నగర్ పట్టణం ఏబీ కాంప్లెక్స్ లో బీజేపీ పట్టణ అధ్యక్షులు హరి భూషణ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అందె బాబయ్య మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణ అభివృద్ధిలో గత పాలకుల వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. మౌలిక వసతుల కొరత, డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, రోడ్ల దుస్థితి వంటి సమస్యలపై ప్రస్తుత పాలకులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. అదేవిధంగా గత పదేళ్ళ పాలన లో షాద్ నగర్ అభివృద్ధి కి బీఆర్ఎస్ నిధులు గుండు సున్నా అని, షాద్ నగర్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రజలకు మంజూరు చెయ్యలేదని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, శుభ్రమైన పాలన, పారదర్శకతతో కూడిన పరిపాలన అందించడం సాధ్యమవుతుందని అన్నారు. యువత, మహిళలు, పేదల సంక్షేమమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తుందని, మున్సిపల్ స్థాయిలో కూడా అదే విధంగా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించే లక్ష్యం బీజేపీ ముందుకు పోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో దేపల్లి అశోక్ గౌడ్, నర్సింహా గౌడ్, వంశీ కృష్ణ, మల్చలం మురళి, ఎంకనోళ్ల వెంకటేష్, మఠం ఋషికేష్,మహిళా మోర్చా నాయకులు, శ్రీనివాస్ చారి,గజ్జల ప్రవీణ్,పసులోటి శ్రవణ్,కంచుకోట మణికంఠ, కాసజు శివ,శ్యామ్ సుందర్,వెంకటేష్,అందేల సందీప్,క్యామ మహేష్, రమేష్,అంజనేయులు, నక్కల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ అధికారి పురస్కారాన్ని అందుకొన్న విద్యాశాఖాధికారి దివాకరరావు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండల విద్యాశాఖాధికారి(1)గా చేస్తున్న ఎం.దివాకరరావు ఉత్తమ అధికారి పురస్కారాన్ని పొందారు. 77వ గణతంత్ర దినోత్సవాలలో భాగంగా జిల్లాలో సమర్ధవంతంగా పనిచేసినవారికి ఇచ్చే పురస్కారాలలో భాగంగా దివాకరరావు ఉత్తమ అధికారిగా గౌరవ పురస్కారాన్ని కలెక్టర్ విద్యా మీనన్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆయనకు పేరు పేరున శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా భారత మాతా పూజ కార్యక్రమం



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం తిక్కవానిపాలెం గ్రామంలో భారతమాత పూజ కార్యక్రమం అనంతరం అభయ ఆంజనేయ స్వామి తీర్థం సందర్భంగా గాయిత్రి హోమం చేయడం జరిగింది. అంగరంగ వైభవంగా ముగ్గులు పోటీలు, కొలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సేవగరిడి, కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో పెద్దలు, ఆలయం కమిటీ సభ్యులు, ధార్మిక జట్టు సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో మీడియా పాత్ర కీలకమైనది

- సమాజంలో జరుగుతున్న సంఘటనలను వెంటనే తెలియజేయడంలో మీడియా ముందుంటుంది
- ఫరూక్ నగర్ తహశీల్దార్ నాగయ్యా, ఎంపీడీవో బన్సీలాల్
- జయభేరి ప్రింట్ మీడియా జర్నలిస్టు బన్నె శ్రీకృష్ణ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన తహసిల్దార్ నాగయ్య, ఎంపీడీవో బన్సీలాల్





**జయభేరి, షాద్ నగర్, జనవరి 27 :**

ప్రజల సమస్యల కోసం నిరంతరం పనిచేసేది మీడియా రంగమని తహసిల్దార్ నాగయ్య, ఎంపీడీవో బన్సీలాల్ అన్నారు. ఎక్కడ ఏం జరిగినా వెంటనే సమాచారం ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అందజేసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజల సమస్యలు నెరవేరే వరకు ప్రజల పక్షాన ఉండే రంగం మీడియా అని వారు అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల తహసిల్దార్ నాగయ్య, ఎంపీడీవో బన్సీలాల్ జయభేరి జర్నలిస్టు బన్నె శ్రీకృష్ణ 2026 దినపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్, ఎంపీడీవో మాట్లాడుతూ... మీడియా రంగంలో చురుకైన పాత్రను పోషిస్తూ నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజల సమస్యలను నిరంతరం అధికారులకు నాయకులకు లిఖిత పూర్వకంగా వ్యక్తపరుస్తూ ప్రజల సమస్యలు నెరవేర్చే వరకు కలాన్ని ఘనంగా ప్రజల పక్షాన వాస్తవాలు రాయాలని ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి చేస్తే ప్రజలకు న్యాయం చేసే విధంగా అధికార యంత్రాగం పనిచేస్తుందని వారు పేర్కొన్నారు.



## తెలంగాణ రాష్ట్రంలో మోగిన మున్సిపల్ ఎన్నికల నగారా

- ఫిబ్రవరి 11 న ఎన్నికలు, 13న ఫలితాలు విడుదల..
- ఈ నెల 28 నుంచి 31 వరకు నామినేషన్ల స్వీకరణ..

**జయభేరి, శామీర్ పేట్ :**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 7 నగర పాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరి 11 న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఫిబ్రవరి 13న ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో అన్ని పార్టీల నేతలు సమాయత్తం అవుతున్నారు. ఈ మేరకు ఈ నెల 28 నుంచి మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లను స్వీకరించనున్నారు. జనవరి 30 వరకు అభ్యర్థులు దాఖలు చేయవచ్చునని , ఈ నెల 31 న నామినేషన్ ల స్క్రూటిని ఉంటుందని, ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. కాగా అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నుండి శుక్రవారం వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు.

## తహసిల్దార్ హన్మంతు శ్రీనివాస్ గౌడ్ కు సన్మానం



**జయభేరి, డిండి :**

77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ తహశీల్దార్గా జిల్లా కలెక్టర్ నల్లగొండ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన హన్మంతు శ్రీనివాస్ గౌడ్ తహశీల్దార్ (FAC) గుండ్లపల్లి ని తహసీల్దార్ కార్యాలయం లో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో డిండి టౌన్ BRS అధ్యక్షులు గిరమోని శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు MD రషీద్, BRSV అధ్యక్షులు గుర్రం సురేష్, కాసుల ఐలేష్ చారి,మూడవత్ బాసూ, అరేకంటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ధన్యవాదాలు

- ఫరూక్ నగర్ నుండి నాగులపల్లికి నూతన రోడ్డుతో తీరనున్న ప్రయాణికుల కష్టాలు
- మొత్తం 2 కోట్ల 10 లక్షలు నిధులతో నూతన రోడ్డు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు "నందిమల రాములు గౌడ్"



**జయభేరి, షాద్ నగర్, జనవరి 27 :**

షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూక్ నగర్ మండలం నాగులపల్లికి నూతన రోడ్డుతో మారనున్న గ్రామ రూపురేఖలు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నందిమల రాములు గౌడ్ అన్నారు. సోమవారం ఉదయం ఫరూక్ నగర్ నుండి నాగులపల్లి వరకు 1కోటి 70 లక్షలు , కల్వర్టుకు 40 లక్షలు నిధుల మంజూరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మొత్తం నిధులు 2 కోట్ల 10 లక్షలు మంజూరు చేసి నూతన రోడ్డును శ్రీకారం చుట్టారని రాములు గౌడ్ అన్నారు. ప్రజా పాలనలో ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. 2 నుండి 3 నెలలో రోడ్డు పనులు పూర్తి చేస్తామని అందుకు సంబంధించిన పనుల గురించి అందరితో కలిసిమెలిసి అభివృద్ధి వైపు నడిపిస్తామని రాములు గౌడ్ అన్నారు. భవిష్యత్తులో నాగులపల్లి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నామని పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ నాయకునికి కాంగ్రెస్ పార్టీలో ఉన్నత అవకాశాలు కూడా పూర్తిస్థాయిలో అందిస్తామని అన్నారు. సీనియర్ నాయకుల నుంచి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుని భవిష్యత్తు లో వచ్చే ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చాలా పటిష్టంగా పోటీ చేస్తుందని అందరం కలిసి మెలిసి తగిన నిర్ణయాలు తీసుకొని త్వరలో ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు రాములు గౌడ్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

## 84వ వార్డు వైకాపా పార్టీ ప్రధాన కార్యదర్శిగా సాలాపు సంతోష్ నియామకం



**జయభేరి, పరవాడ :**

సాలాపువానిపాలెం గ్రామానికి చెందిన సాలాపు సంతోష్‌ను 84వ వార్డు వైకాపా ప్రధాన కార్యదర్శిగా పార్టీ ఇన్‌ఛార్జ్ కోరుకొండ రాఘవ చూచనల మేరకు నియమించారు. సంతోష్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన ఈ పదవిని గౌరవంగా భావించి, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. నన్ను ఈపదవికి అర్హునిగా భావించి, నియమించడానికి కారకులైన మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్, మలసాల భరత్ కుమార్ లకు ధన్యవాదనలు తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేసిన సోమల కర్ణాకర్



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 27 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం వేళలో స్పెషల్ క్లాసులను నిర్వహిస్తున్న సందర్భంగా గ్రామానికి చెందిన మూడో వార్డు సభ్యుడు సోమల కర్ణాకర్ విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నడుస్తున్న సందర్భంగా సాయంకాలం ఆకలి ఉండకూడదు అనే ఉద్దేశంతో ఆలోచించి ప్రతి రోజు స్నాక్స్ పంపిణీ చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ప్రలోభాలకు లోబడకుండా చదువుపైనే దృష్టి సారించాలని అన్నారు మంచిగా చదివి పాఠశాల నుండి మండల్ లో మొదటి స్థానం రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు ఐదో వార్డు సభ్యుడు కోట భాగ్యలక్ష్మి విజయ్, మండల నాయకులు గుండెబోయిన రాజు, ఎస్కే సాదుల్లా, సాయి కృష్ణ, కోట పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## తుర్కపల్లి మండల కేంద్రంలో కోతుల సమస్య పరిష్కారం



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 27 :**

తుర్కపల్లి మండల కేంద్రంలో ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి సహకారంతో కోతుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోట సురేష్ అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఇప్పటివరకు 210 కోతులను పట్టించడం జరిగిందని అట్టి కోతులను ఉమ్మడి మెదక్ జిల్లా నరసాపూర్ అడవుల్లో వదిలిపెట్టినట్టు తెలిపారు. మండల కేంద్రంలో ప్రతి చోట్ల బోన్లను బిగించి కోతులను అరికట్టాలని ఉద్దేశంతో ఆర్.టి.ఐ కమీషనర్ సహాయ సహకారాలతో ఇట్టి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు గ్రామ ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బొల్లారం జగదీష్, రొయ్యల విజయ్, ఆకుల అమరేందర్, ఆకుల దేవయ్య, సోమల రామ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని అడ్డాకుల మండలం శాఖాపూర్ లో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి కుటుంబ సభ్యులను మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి పార్టీవ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనిత గ్రేటర్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ వాసవి క్లబ్ వాసవి క్లబ్ వనిత గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో స్థానిక గర్ల్స్ హై స్కూల్ నందు ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు పందిరి జ్యోతి వెంకన్న, కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి, కోశాధికారి ఆలంపల్లి శిరీష, వాసవి క్లబ్ అధ్యక్షులు అతుకూరి ఆంజనేయులు, కార్యదర్శి బెల్దే రవీందర్, కోశాధికారి పందిరి వెంకన్న, బెల్దే మాధవి, అలంపల్లి పద్మ, కొత్త సావిత్రి, దొడ్డి శారద, నీల స్వాతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## అతి త్వరలో జిల్లా సాధన సమితి తరపున జాయింట్ ఆక్షన్ కమిటీ



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ జిల్లా సాధన సమితి కార్యవర్గ సభ్యులకు దేవరకొండ నియోజకవర్గం లోని అన్ని కుల సంఘాలు అన్ని రాజకీయ పార్టీ నాయకులు విద్యార్థులు ఉద్యోగులు మేధావులు కవులు కళాకారులు తెలియజేయునది అతి త్వరలో జిల్లా సాధన సమితి తరపున జాయింట్ ఆక్షన్ కమిటీ ఏర్పాటు చేయుటకు నిర్ణయించినది కావున జిల్లా సాధనకై ప్రతి ఒక్కరము పోరాటం చేసి సాధించు కోవలసిన అవసరం ఎంతైనా ఉంది కావున తమరికి తొందరలోనే తేదీని ప్రకటించబోతున్నాము అని తెలియపరచుచున్నాము అని దేవరకొండ జిల్లా సాధన సమితి జర్పుల లోక్య నాయక్ సెక్రెటరీ జనరల్ ఒక ప్రకటనలో తెలియజేసినారు.

## మానవత్వాన్ని చాటుకొని వృద్ధురాలికి ఆర్థిక సహాయం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలో రోజు వారి పర్యటనలో భాగంగా దేవరకొండ డిపో ఎదురుగా గుర్తు తెలియని బైకు ఢీకొట్టడంతో వృద్ధురాలు రోడ్డుపై ప్రమాదానికి గురై ఆపస్మారక స్థితిలో పడి ఉండడంతో చూసి తన వాహనాన్ని ఆపి అటు నుంచి వస్తున్నా 108 అంబులెన్స్ ఆపి అందులో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి కాళ్లకు బలమైన గాయం కావడంతో డాక్టర్ సిబ్బందులతో మాట్లాడి ఎక్సరే చేయించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు వృద్ధురాలికి ఆర్థిక సహాయం చేసి తన మానవత్వని చాటుకున్నారు.

## ప్రొసీడింగ్స్ లను అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం గూరకొండలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రొసీడింగ్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించాలి

- జిల్లా ఇంచార్జీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నేడు జిల్లా ఇంచార్జీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత, దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, అతి త్వరలో జరగబోయే దేవరకొండ మున్సిపల్ ఎన్నికల్లో 20కి 20 స్థానాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలవాలి అనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా పాలన కొనసాగుతుందని, ఆర్థికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. పేదలు, మధ్యతరగతి, రైతులు, మహిళలు, యువత కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ, దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల ఆశీర్వాదంతో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

ప్రతి వార్డులో పార్టీ బలాన్ని పెంచి ప్రజల మద్దతు సంపాదించాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మంజూరైన స్కూటీలు, వీల్ చైర్లు, స్మార్ట్ ఫోన్లు దివ్యాంగులకు, వికలాంగులకు, మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మున్సిపాలిటీలో ముమ్మాటికి ఎగిరేది కాంగ్రెస్ జెండానే

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

జయభేరి, దేవరకద్ర :

త్వరలో జరగబోయే దేవరకద్ర మున్సిపాలిటీలో ముమ్మాటికి కాంగ్రెస్ జెండానే ఎగురుతుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. ఓటర్లు అందరూ అధికార పార్టీకి ఓట్లు వేసి అభివృద్ధికి బాట వేయాలని ఆయన కోరారు. మున్సిపాలిటీలను గెలిపించాల్సిన బాధ్యత ఓటర్లపై ఎంతైనా ఉందన్నారు. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఓటర్లందరూ జరగబోయే మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలువాలన్నారు. ఆ బాధ్యతకు అండగా నిలిచి అభివృద్ధిని అందించే బాధ్యత నాది అని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

## రైల్వే పనులకు శంకుస్థాపన చేసిన ఎంపి ఈటల



జయభేరి, మేడ్చల్ :

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రజల చిరకాల కోరిక నెరవేరుస్తూ, రూ. 80.47 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మంగళవారం నేరెడ్మెట్ రైల్వే స్టేషన్ వద్ద శంకుస్థాపన చేశారు. వాజ్పేయి నగర్ లోని లెవెల్ క్రాసింగ్ గేట్ (బి.పి. నం. 8) స్థానంలో రోడ్ అండర్ బ్రిడ్జ్ (RUB), సఫీల్గూడ లోని రైల్వే స్టేషన్ సమీపంలో పరిమిత ఎత్తు సబ్వే (LHS)ల నిర్మాణాకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి, కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, వి. శ్రవణ్ కుమార్, మీనా, గున్నల సునీత, కొంతం దీపిక, చింతల శాంతి, మేకల సునీత, సబితా, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (DRM) డా. ఆర్. గోపాల కృష్ణ, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ కే. ముత్యాల నాయుడు, రామారావు, సీపీఆర్వో శ్రీధర్ రావు, డీజీఎం ఉదయ్ నాథ్ గారు తదితరులు పాల్గొన్నారు.

# దత్తాయిపల్లిలో పులి పంజా..

జయభేరి, తుర్కపల్లి, జనవరి 27 :

తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామంలో శ్రీశైలం కు చెందిన రెండు ఆవులు నిన్న దత్తాయిపల్లి కంచెలు పొడి దాడి చేసిన సమయంలో తప్పించుకొని పోయిన రెండు ఆవులను పులి చంపి తిన్న ఆనవాళ్లు కాన్వాలు రిజర్వ్ ఫారెస్ట్ నుంచి వచ్చిన ఎనిమల్ రాకర్స్ సిస్టం గుర్తించారు. మంగళవారం తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామంలోని ఫారెస్ట్ ప్రాంతంలో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కర్ణాకర్, మండల తహసిల్దార్ జలజ కుమారి, ఆధ్వర్యంలో సి ఎఫ్ ఓ రాంబాబు, డిఎఫ్ఓ సురేందర్ రెడ్డిలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాప్ కెమెరాకు పులిచిక్కిందని అన్నారు. 300 కేజీల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. పులిని గుర్తించే పనిలో ఎనామల్ ట్రాకర్స్ టీం 24 గంటలు పని చేస్తుందని అన్నారు. కన్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి వచ్చిన టీం ప్రత్యేక పరిశీలనలో ఉన్నారని అన్నారు. రెండు పులులు ఉన్నాయా ఒకటి అనే అనుమానం అర్థం కావడం లేదని అన్నారు. ఇటు రాళ్ల జనగాం అనంతరం తిమ్మాపురం వెంటనే దత్తాయపల్లి ఎటాక్ రెండు పులులు ఉన్నాయా అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. భయం గుప్పెట్లో జనం ఉన్నారని మూగజీవులను చంపితింటున్న పుల్లలను అరికట్టాలని, ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఆవులను కోల్పోయి రోదిస్తున్న రైతు కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని అన్నారు. అటవీ శాఖ అధికారులు పులి దాడి నుండి త్వరగా తప్పించాలని కోరుకుంటున్నారని అందుకు ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రజలు ఆ ప్రమాదంగా ఉండాలని ప్రభుత్వపరంగా ఫారెస్ట్ డిపార్ట్మెంట్ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పశువులను బావి వద్ద కాకుండా ఇంటి వద్దనే కట్టి వేసుకోవాలని తగు సూచనలు సలహాలు చేస్తున్నట్లు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.



# SPDCL కాంట్రాక్టర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ఎమ్మెల్యే నివాసంలో నేడు SPDCL కాంట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని, విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడంలో కాంట్రాక్టర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు.



ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు SPDCL కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు అంకితభావంతో పని చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కాంట్రాక్టర్ల సహకారం మరింత అవసరమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ డా. వేణుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లారెడ్డి, అనంతగిరి, SPDCL కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు గాజుల శ్రీనివాస్, సంతోష్, జువ్వ శ్రీనివాస్, బి. సైదులు, సైదులు, యాదయ్య, హనుమ, మున్న, యాదయ్య, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ చేతుల మీదుగా ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు చెక్కుల పంపిణీ

జయభేరి, ఉప్పల్ :


హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి చేతుల మీదుగా ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు 5 లక్ష రూపాయల చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య అనేది సమాజాభివృద్ధికి పునాది అని, ముఖ్యంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకుండా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఇలాంటి గొప్ప నిర్ణయం తీసుకోవడం అభినందనీయం అని మేయర్ విజయలక్ష్మి అన్నారు. ద్యార్థులు కష్టపడి చదివి మంచి వైద్యులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, మహేష్ గౌడ్, రాజు కుమార్, సీత రాము కాలనీ అధ్యక్షుడు రమేశ్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# తెలంగాణ తిరుపతి "మన్యంకొండ పుణ్యక్షేత్రం"

- 28 నుండి మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- దేవస్థానం ఏర్పాటుకు అలహరి వంశీయుల కృషి అమోఘం
- ఫిబ్రవరి 1న అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం
- జిల్లా, రాష్ట్ర నలు మూలల నుండి తరలి రానున్న వేలాది భక్తులు
- బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు ఒక సేవ
- శేషసాయి పడగ నీడలో కొలువుదీరి దర్శనం ఇవ్వనున్న స్వామి వారు

జయభేరి, దేవరకద్ర :







మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుండి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలలోని ప్రధాన ఘట్టమైన స్వామివారి రథోత్సవాన్ని ఫిబ్రవరి 1న అర్ధరాత్రి దాటిన తర్వాత నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుండే గాక ఇతర రాష్ట్రాల నుండి కొన్ని వేల మంది భక్తులు మన్యంకొండకు తరలివస్తారు. దేవస్థానం తేరు మైదానంలో స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా తెలంగాణ తిరుపతి గా భాసిల్లుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారు గుట్టపై గుహలో శేష సాయి పడగ నీడలో కొలువుదీరి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మాఘ శుద్ధ దశమి రోజున స్వామివారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.

### స్వామి వారి చరిత్ర

మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి కొన్ని వందల సంవత్సరాల చరిత్ర ఉంది. తవ్వని కోనేరు, చేయని పాదాలు,ఉలి ముట్టని స్వామిగా స్వామివారు కొలువబడుతున్నారు. మహామహులైన శ్రీ నరసింహయోగి, శ్రీ ఎత్తేపు రామ యోగి, శ్రీ కాశీరాయలు మొదలు తపస్సు సంపన్నులైన భాగవోత్తములచే కొలువబడి "ఋషి కొండగా"వినతికెక్కి కలియుగ వైకుంఠంగా కొలిచే వారికి కొంగు బంగారమై విరాజిల్లుతున్నాడు స్వామి వారు. శ్రీ వెంకటనాథుని దివ్యచరణ కమలా రవింద్రముల చెంత తన నిత్య కీర్తనలచే భక్తి సంద్రంలో ముంచెత్తిన ప్రముఖ వాగ్గేయయకారులైన శ్రీమాన్ అళహరి హనుమద్దాసుల వారి మంగళ శాసనములతో ప్రారంభించబడిన మన్యంకొండ వెంకటపతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రకృతి సిద్ధమైన కొండలపైగల గుహలో మునీశ్వరులు భక్తులను అనుగ్రహించడానికి లోక కళ్యాణార్థమై తపస్సు చేయుచుండగా, ఈ యుగారంభంలో కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆదిశేషావతా రూపంలో గల రాతి గుహలో స్వయం స్వయం వ్యక్తమై ఉన్నారు. మహానుభావులైన సిద్ధ పురుషులు, మునీశ్వరులు తపస్సు చేయడం వలన మునులకొండగా వాడుకలోకి వచ్చి కాలక్రమేన మన్యంకొండగా దేవస్థానం పిలువబడుతుంది. మహబూబ్ నగర్ నుండి 20 కిలోమీటర్ల దూరంలో, రాయచూరు వైపు వెళ్లే మార్గంలో, స్టేజి వద్ద నుండి 3 కిలోమీటర్ల ఘాట్ రోడ్డు పైన ఉన్న గుట్టపై ప్రకృతి సిద్ధమైన కొండపైన గుహలో కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారు మన్యంకొండపై కొలువబడుతున్నారు. ఇది ఒకప్పుడు మహా రన్య ప్రదేశం అయినందున. ఈ కొండ చుట్టూ హరి గిరిలు, ఎన్నో ఉండేవి. ఈ గుహల యందు గిరులు ఎన్నో ప్రకృతి మార్పుల వల్ల ఈ కొండకు గుహలు, స్వరంగాలు ఏర్పడ్డాయి. భాగవతోత్తములు మన్యం కొండపై ఎందరో మహానుభావులు తపస్సు చేసి సిద్ధి పొందారు. కొందరు పూర్వజ్ఞాన సంపన్నులు కూడా ఉన్నారు. భజన చేయు వారిని చూసినారని ఇటువంటి మహానుభావులలో శ్రీ నరసింహయోగి, శ్రీ ఎత్తేపురామ యోగి, శ్రీ కాశిరాయలు, శ్రీ వీరప్పయ్య, శ్రీమాన్ శ్రీ హనుమద్దాసుల వారు ఉన్నారు. వీరు పూర్వజ్ఞాన సంపన్నులు. వీరు తపస్సు చేసిన గుహలు ఇప్పటికీ దేవస్థానం సమీపంలోనున్న ఒక కొండపై ఉన్నాయి.

### దేవస్థానం ఏర్పాటుకు అలహరి వంశీయుల కృషి..

మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఏర్పాటుకు అళహరి వంశీయుల కృషి ఎంతగానో ఉంది. తమిళనాడులోని శ్రీరంగం సమీపంలో గల అళహరి గ్రామ నివాసి శ్రీ అలహరి కేశవయ్య కలలో శ్రీనివాసులు వారు దర్శనమిచ్చి, కృష్ణా నది తీర ప్రాంతంలో గల మన్యం కొండ పై నేను వెలిసి యున్నాను.. నీవు వెంటనే వెళ్లి నిత్య విధి సేవా కార్యక్రమాలు నిర్వహించవలసిందిగా ఆదేశించి అంతర్థానమయ్యారు. దీంతో శ్రీ అళహరి కేశవయ్య గారు మేల్కొని స్వామివారి ఆజ్ఞ ప్రకారం వెంటనే కుటుంబ సమేతంగా మన్యంకొండ సమీపంలోని కోటకద్ర గ్రామానికి వచ్చి స్థిరపడి కొండపైన గల స్వామివారికి సేవ చేయడం ప్రారంభించారు. శ్రీ అళహరి కేశవయ్య గారు కూడా దక్షిణాదిలో గల అన్ని దివ్య క్షేత్రములు దర్శించి తరించిన మహానుభావుడు. ఒకానొక రోజు సమీపంలో గల కృష్ణా నదిలో స్నానం చేయుచు గొంతువరకు నీటిలో ఉండి సూర్యభగవానునికి దోసిటిలో అర్ఘ్యం వదులుతున్న సమయంలో చక్కని శిలారూపంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమ నదిలో అలల ద్వారా వచ్చి కేశవయ్య దోసిలిలో నిలిచెను. నదిలో నుండి వచ్చి దోసిలో నిలిచిన విగ్రహమును పరిశీలించగా.. శ్రీనివాసునిగా గుర్తించి స్వామి ప్రతిమను తీసుకవచ్చి మన్యం కొండపై శేష సాయి రూపంలో గల గుహలో ప్రతిష్టించి నిత్య దూపదీప నైవేద్యములతో స్వామిని ఆరాధించి సంత సించారు. స్వామి ముందు మండపంలో ఆంజనేయస్వామి, గరుడల్వార్ విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. ఈ కొండపై శివ కేశవులకు భేదము లేదు. కేశవుడు శిరస్సులు కల శేషాద్రిపై శ్రీ లక్ష్మీదేవి సమేతంగా వెలియగా.. శివుడు పార్వతి దేవి సమేతుడై హిమగిరిలయందు వెలిసినట్లు కనిపిస్తారు. ఈ క్షేత్ర పాలకుడు వీరభద్రుడు స్వామి సన్నిధిలో స్వామివారి పాదములు, మునుల కొండ, జూబి తీర్థములు, నందిదోన గుహలు దేవస్థానంలో ఇప్పటికీ ఉన్నాయి. రామయోగి చెప్పిన గుర్తుల ఆధారంగా హనుమద్దాసులవారు జన్మించారు. వారికి మైసూరు లక్ష్మంబచే గురుపదేశం జరిగెను. తర్వాత హనుమద్దాసుల వారికి భద్రాచలంలో శ్రీ రాములవారి సన్నిధిలో తారక రామ ఉపదేశం జరిగేను. ప్రహ్లాదుని లక్షణములు కలిగియుండి భగవంతుడి యందు భక్తితో దినదిన అభివృద్ధి చెందుతుంది మన్యం కొండ దేవస్థానం. స్వామివారిని అనేక విధాలుగా కీర్తించారు. కీర్తించి పాడిన భజన కీర్తనల పుస్తకములు అచ్చు వేయబడి పామరజనుల వరించి కీర్తించుటకు అందుబాటులో కలదు. వారు వాడిన తాంబూర స్వామి వారి సన్నిధిలో కలదు. శ్రీ హనుమద్దాసుల స్వామివారి ఆజ్ఞ మేరకు మన్యం కొండను రెండవ తిరుపతిగా ప్రచారం చేసి భక్తుల హృదయంలో, భక్తి విశ్వాసములు పెంపొందించారు. అభిషేకం గురించి కోనేరు తవ్వగా కోనేరులో బండ వచ్చింది. ఆ బండపై ఒంటి కాలుపై ఏక దీక్షతో భజన చేయగా అట్టి బండ పగిలి నీరు ఉద్భవించింది. శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు వీరిచే ప్రారంభించబడ్డాయి. తర్వాత శ్రీ అళహరి రామయ్య గారు వంశపారంపర్య ధర్మకర్తగా దేవాలయం ఎంతో అభివృద్ధి చేశారు. ఆగమ శాస్త్ర ప్రకారంగా దేవాలయ రాజగోపురం, ప్రహరీ గోడలు, యాత్రికులు బస చేయుటకు సత్రాలు నిర్మించారు. మంచినీటి వసతి, విద్యుత్ దీపాలంకారాలు, భక్తులు దేవాలయానికి సునాయాసంగా వాహనాలపై కాలి నడకన చేరుకున్న నిమిత్తం ఘాట్ రోడ్డు వేయించారు. పెద్ద బావిని తవ్వించి పైపులైన్ ద్వారా కొండపైకి నీటి వసతి కల్పించారు.

### బ్రహ్మోత్సవ విశేష ఉత్సవాలు

ఉత్సవాల మొదటి రోజు ఈనెల 28న స్వామి వారి గజ వాహన సేవ నిర్వహించనున్నారు. ఈనెల 29న హంస వాహన సేవ, 30న సూర్యప్రభ వాహన సేవ, 31న హనుమత్ వాహన సేవా, 1న గరుడవాహన సేవ మరియు అర్ధరాత్రి దాటిన తర్వాత స్వామివారి రథోత్సవం, 2న అశ్వవాహన సేవ, ద్వితీయ ప్రభోత్సవం, 3న వసంతోత్సవం, అవబృతస్థానం, రాత్రికి శ్రీ స్వామి వారి శేష వాహనం మరియు దర్బారు, సేవ సంగీత సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్, వంశపారం పర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాస రాజు తెలిపారు.

### బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి: దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్

మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం చైర్మన్, వంశపారం పర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వద్ద అని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. దేవస్థానం పవిత్రతను దృష్టిలో పెట్టుకొని పరిశుభ్రత విషయంలో దేవస్థానానికి సహకరించాలని మధుసూదన్ కుమార్ కోరారు.




శ్రీమాన్ శ్రీ అళహరి హనుమద్దాసులవారు | శ్రీమాన్ శ్రీ అళహరి అనంతయ్య గారు | శ్రీమాన్ శ్రీ అళహరి పెద్ద రామయ్య గారు




శ్రీమాన్ శ్రీ అళహరి రామయ్య గారు | శ్రీ అళహరి నారాయణస్వామి, బి.ఏ | శ్రీ అళహరి మధుసూధన్ B.Com., వంశపారంపర్య ధర్మకర్త



# సింగరేణిలో జరుగుతున్నది దోపిడీ

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న అవినీతి, ముఖ్యంగా సింగరేణిలో జరుగుతున్న దోపిడీ విషయంలో రాష్ట్ర గవర్నర్ ని కలిసి ఒక వివరమైన విజ్ఞాపన పత్రాన్ని అందజేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు ఉప్పల్ MLA బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల బృందం. అనంతరం మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మా పార్టీ తరపున శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, మా సీనియర్ నాయకుల బృందం అందరం కూడా కలిసి గవర్నర్ కు ఒక వివరమైన విజ్ఞాపన పత్రాన్ని ఇచ్చాం. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, ముఖ్యంగా సింగరేణిలో జరుగుతున్న దోపిడీ విషయంలో వారికి అందజేయడం జరిగింది. సింగరేణిలో అవినీతి జరుగుతున్నదని ఆధారాలతో సహా మా శాసనసభాపక్ష ఉపనాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు పత్రికా సమావేశం పెట్టి, ఆధారాలతో సహా బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైంది. మీడియా కూడా మాకు సహకరించి ఈ కుంభకోణాన్ని పూర్తిస్థాయిలో బట్టబయలు చేసేసరికి పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కేవలం మాట్లాడటమే కాదు, ఆధారాలతో సహా మరి ఈరోజు పూర్తిస్థాయిలో ఈ కుంభకోణాన్ని బట్టబయలు చేసినం. దాన్ని డైవర్ట్ చేయడానికి, ప్రజల అటెన్షన్ ని, దృష్టి మళ్లించడానికి, విచారణ పేరిట ఇవాళ ఒకరి తర్వాత ఒకరిని పిలుస్తునారు. ఇవాళ సీఎం అంటే తెలంగాణలో చీఫ్ మినిస్టర్ కాదు, సీఎం అంటే కోల్ మాఫియాకి నాయకుడిగా ఇవాళ రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా సింగరేణి కార్మికులు భావించే పరిస్థితి వచ్చింది. ఈ కుంభకోణాన్ని, రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా సింగరేణి ప్రాంతంలో ఉండే మా కార్మిక సోదరులు కూడా అర్థం చేసుకుంటే... చాలా స్పష్టంగా ఆధారాలతో సహా మేము బయటపెట్టిన తర్వాత, ముఖ్యంగా మేము లేవనెత్తిన కొన్ని ప్రశ్నల విషయంలో ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఒక్క సమాధానం కూడా రావడం లేదు. ఈ విషయంలో స్పందించాల్సిన ముఖ్యమంత్రిమో అప్పుడప్పుడు ఫుట్ బాల్ ఆడుతున్నాడు సింగరేణితో... లేదా ఇవాళ విదేశాల్లో తిరుగుతూ ఏదో పాఠాలు నేర్చుకుంటున్నా అంటూ ఫోజులు కొడతా ఉన్నాడు. కానీ నేను వారికి గుర్తు చేస్తా ఉన్నా.. ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలి. చదువుకోవాల్సిన టైంలో చదువుకోక ఇప్పుడు చదువుకుంటానంటే ఏం వస్తదో ఒకసారి వారు కూడా ఆలోచించుకోవాలి. పది కోట్ల రూపాయలు సింగరేణి నిధులు, సింగరేణి సంస్థకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేసి, మీరు ఫుట్ బాల్ ఆటకి వినియోగించడం జరిగింది. ఈ రాష్ట్ర ప్రజలతో మీరు ఎలాగూ ఫుట్ బాల్ ఆడుతున్నారు, కానీ సింగరేణి సంస్థతో కూడా ఫుట్ బాల్ ఆడుతూ పది కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసి ఈరోజు ఆ సంస్థకి తీరని అన్యాయం చేసిండు రేవంత్ రెడ్డి. ఒక్క స్కామ్ కి సంబంధించి ఇన్ని ఆధారాలు బయటపెడితే కూడా, స్కామ్ కు సంబంధించి ఇప్పటివరకు పాలకుల వైపు నుంచి సమాధానం లేదు. టెండర్ల విషయంలో గతంలో ఎన్నడూ లేని 'సైట్ విజిట్ సర్టిఫికేషన్', అంటే మీరు సైట్ మీదకి రావాలి, అక్కడికి వచ్చినట్టు సర్టిఫికెట్ తీసుకోవాలి అన్న నిబంధన పారదర్శకతకు పాతరవేసి ఎందుకు పెట్టినారు? గతంలో ఎన్నడూ లేని విధంగా ఇది ఎందుకు పెట్టారంటే ఇంతవరకు సమాధానం లేదు.

భారతదేశంలో ఎక్కడ ఏ కోల్ గనిలో లేని, ఏ బొగ్గు గనిలో లేని నిబంధన ఇక్కడనే ఎందుకు పెట్టినారు అంటే ఇంతవరకు సమాధానం రాదు. అట్లాగే నిజంగానే 2018 నుంచి 2024 వరకు ఈ నిబంధన గనుక కేంద్ర ప్రభుత్వం ఒకవేళ సిఫారసు చేసి ఉంటే, ఆ రోజున్న బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదు. అన్ని టెండర్లను కూడా ట్రాన్స్పరెంట్ గా ఆనాడు మేము పిలిచినాం. అందుకే ఆరోజు అన్ని మైనస్ టెండర్లు వచ్చినాయి. ఎస్టిమేటెడ్ కాస్ట్ కంటే తక్కువ ఖర్చుకే సింగరేణికి డబ్బు ఆదా చేస్తూ ఆరోజు జరిగిన మాట వాస్తవమా కాదా? టెండర్లలో లేని షరతు మీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' అనే విధానం ఎందుకు పెట్టారు? ఎవరికి లాభం చేయడానికి? నిబంధన అప్పటి నుంచి తొమ్మిది నెలల్లో ఎన్ని సంస్థలు ఇప్పటివరకు ఎంతమంది కాంట్రాక్టర్లు సైట్ సందర్శించారు? మీకు ఎన్ని ఈమెయిల్స్ వచ్చాయి? ఎన్ని లేఖలు వచ్చాయి? ఎన్ని సర్టిఫికేట్లు సింగరేణి సంస్థ జారీ చేసింది? ఒక వైట్ పేపర్ (శ్వేత పత్రం) ప్రచురించండి అని మేము డిమాండ్ చేస్తే ఇంతవరకు సమాధానం లేదు. కొంతమందికే సెలెక్టివ్‌గా ఎందుకు ఇచ్చారు మీరు? కొంతమందికే సెలెక్టివ్‌గా మీరు ఎందుకు మరి కొంతమంది కాంట్రాక్ట్ సంస్థలనే ఎందుకు మీరు ఎన్నుకుంటున్నారు? మిగతా వాళ్ళని ఎందుకు పక్కన పెడుతున్నారు? ఇందులో రింగ్ మాస్టర్, సృజన్ రెడ్డి అనే వ్యక్తి ముఖ్యమంత్రి బావమరిది అవునా.. కాదా? అని మేము అడిగితే ఇంతవరకు సమాధానం రాదు, ఇంతవరకు ఆయన విషయంలో స్పష్టత రాదు. ఒక నైనీ నీ బొగ్గు గని టెండర్లే కాదు.. అన్ని టెండర్లకు పారదర్శకత ఉండాలి. నైనీలో కూడా గతంలో 2021లో, 2022లో రెండు సార్లు మా ప్రభుత్వం ఉన్నప్పుడు టెండర్లు పిలిచాం. కానీ ఆ రోజు ఈ 'సైట్ విజిట్ సర్టిఫికేట్' అనే నిబంధన లేదు. మరి ఈ రోజు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవసరం లేనిది, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ నిబంధన ఎందుకు అవసరమైంది? సోలార్ పవర్ స్కామ్ గురించి కూడా మేము బయట పెట్టాం.

భారతదేశంలో ఎక్కడైనా మెగావాట్‌కు రెండున్నర నుంచి మూడు కోట్లలో ఇవాళ సోలార్ నిర్మాణం జరుగుతా ఉన్నది. కానీ తెలంగాణలో మాత్రం సింగరేణి పిలిచిన సోలార్ టెండర్లలో మాత్రం ఏడు కోట్లు రెండున్నర మూడు కోట్లలో అయ్యే పని దేశం మొత్తంలో, ఒక్క తెలంగాణలో మాత్రం ఏడు కోట్లు ఎందుకు అవుతున్నది? ఇది స్కామ్ కాదా? సోలార్ పవర్‌లో అని మేము నిలదీస్తే ఇంతవరకు సమాధానం లేదు. అట్లాగే ఎక్స్‌ప్లోజివ్స్, జిలెటిన్ స్టిక్స్, 30 శాతం అదనంగా రేటు పెంచారు. డైరెక్టర్లు నిలదీస్తే బోర్డులో, వాళ్ళ మీద యాక్షన్ తీసుకున్నారు.. తప్ప కాంట్రాక్టర్లకు లాభం చేసే పనిలో మాత్రం కాంగ్రెస్ పార్టీ వెనకకు తగ్గలేదు. ఈ అన్ని విషయాలు ఇవాళ గవర్నర్ దృష్టికి తీసుకు వచ్చినం. కాంట్రాక్టర్లను బెదిరించి, కాంట్రాక్టర్లను ఒక రింగు చేసి ఇవాళ ప్రజా ధనాన్ని దోచుకుంటున్న తీరును వివరించడం జరిగింది. ఇవాళ గవర్నర్ ని అడిగాము. సార్ మీరైనా ఇన్వాల్వ్ కాండి లేదా కిషన్ రెడ్డి గారికి ఆదేశం ఇవ్వండి. సిబిఐ కి ఇస్తారా? సిట్టింగ్ జడ్జికి ఇస్తారా? మీ ఇష్టం ఎవరికి ఇస్తారో ఇవ్వండి. కానీ ప్రజా ధనాన్ని కొల్లగొట్టే ఈ దుర్మార్గపు వ్యవస్థను, అటు సోలార్ పవర్‌లో కుంభకోణం, ఇటు సింగరేణి ఓబి గనుల్లో కుంభకోణం.. దీన్ని అడ్డుకోండి అని విన్నపం చేశాం.





## ప్రభాస్ స్పీడ్‌కు బ్రేకుల్లేవు..

### ‘సలార్ 2’ అప్‌డేట్‌పై అభిమానుల ఉత్కంఠ

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత వేగంగా దూసుకెళ్తున్న దశలో ఉన్నారు. ఒకదానికొకటి మించిన భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆయన, సంక్రాంతి కానుకగా విడుదలైన ‘ది రాజా సాబ్’తో మళ్లీ థియేటర్లలో సందడి చేశారు. ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ప్రభాస్ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని ట్రేడ్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కథ, జానర్ ఎలా ఉన్నా ప్రభాస్ పేరు ఉంటే ఓపెనింగ్స్ ఖాయం అనే విషయం మరోసారి రుజువైంది. ఇదే ఊపుతో ఆయన రాబోయే సినిమాలు మరింత పెద్ద స్థాయిలో రికార్డులు సృష్టిస్తాయన్న అంచనాలు బలపడుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ‘సలార్: పార్ట్ 2 – శౌర్యాంగ పర్వం’పైనే నిలిచింది. ‘సలార్: పార్ట్ 1 – సీజ్‌ఫైర్’ సాధించిన ఘనవిజయం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. భారీ ఓపెనింగ్స్‌తో పాటు పాన్ ఇండియా స్థాయిలో వసూళ్లు రాబట్టిన ఈ సినిమా ప్రభాస్ మాస్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ‘దేవ’ పాత్రలో ఆయన చూపించిన ఇంటెన్సిటీ, యాక్షన్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. దీంతో కథకు కొనసాగింపుగా రాబోతున్న రెండో భాగంపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఇటీవల సోషల్ మీడియాలో ‘సలార్ 2’ నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 25, 2026న ఏదైనా స్పెషల్ అప్‌డేట్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. హోంబలే ఫిలిమ్స్ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ వార్తలు అభిమానుల్లో ఉత్కంఠను పెంచాయి. మరోవైపు చిత్ర బృందం ప్రస్తుతం ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో టీజర్ రిలీజ్‌పై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ ఆ రోజున చిన్న అప్‌డేట్ వచ్చినా సరే, అది నెట్టింట పెద్ద ఎత్తున ట్రెండ్ అవుతుందన్న నమ్మకం అభిమానుల్లో ఉంది. కథ పరంగా ‘సలార్ 2’లో ఖాన్సార్ సింహాసనం కోసం జరిగే రక్తపాత పోరాటమే ప్రధాన ఆకర్షణగా ఉండనుంది. మొదటి భాగంలో స్నేహబంధంతో కనిపించిన దేవ మరియు వరద రాజ మన్నార్ పాత్రలు రెండో భాగంలో శత్రుత్వంగా ఎలా మారతాయన్నది కథకు కీలకం. దేవ ‘శౌర్యాంగ’ వంశానికి చెందినవాడన్న ట్విస్ట్‌తో ముగిసిన పార్ట్ 1, పార్ట్ 2లో భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌కు దారితీయనుందని సమాచారం. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సీక్వెల్‌ను మొదటి భాగాన్ని మించే స్కేల్‌తో, మరింత గ్రాండ్‌గా తెరకెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని టాక్. ఈ సినిమా షూటింగ్ 2026 మధ్యలో ప్రారంభమయ్యే అవకాశాలున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

## ఈ ఏడాదంతా బిజీ!



అగ్ర కథానాయకుడు వెంకటేష్‌కు సంక్రాంతి సీజన్ బాగా కలిసొచ్చింది. గత ఏడాది ‘సంక్రాంతికి వస్తున్నాం’తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నారు. తాజాగా ‘మనశంకర వరప్రసాద్‌గారు’ చిత్రంలో వెంకీగౌడగా అతిథి పాత్రలో అదరగొట్టారాయన. ప్రస్తుతం వెంకటేష్ సక్సెస్‌ట్రాక్‌లో దూసుకుపోతూ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది ఆయన కాల్షీట్స్ మొత్తం ఫుల్ అయిపోయాయి. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో ‘ఆదర్శ కుటుంబం’ చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ అయింది. ఇది పూర్తయ్యాక అనిల్ రావిపూడితో ‘సంక్రాంతికి వస్తున్నాం’ సీక్వెల్‌లో వెంకీ జాయిన్ అవుతారని టాక్ వినిపిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం ఆయన లైనప్‌లో ‘దృశ్యం 3’ కూడా చేరినట్లు సమాచారం. ఈ సినిమా తెలుగు వెర్షన్ ఆగిపోలేదని ఇటీవల నిర్మాత సురేష్‌బాబు క్లారిటీ ఇచ్చారు. అక్టోబర్‌లో ‘దృశ్యం 3’ పట్టాలెక్కుతుందని తెలిపారు. అదేగనుక నిజమైతే ‘సంక్రాంతికి వస్తున్నాం’ సీక్వెల్‌తో పాటు ‘దృశ్యం 3’ చిత్రాలు సమాంతరంగా షూటింగ్‌ను జరుపుకుంటాయి. మొత్తానికి ఈ ఏడాది మూడు భారీ చిత్రాలతో బిజీబిజీగా గడుపబోతున్నారు విక్టరీ వెంకటేష్.



## ఫ్యూచర్‌లో పీఎం అయినా నేను ఆశ్చర్యపోను..

‘పవన్ కల్యాణ్ ఎంతో మందికి దేవుడితో సమానం. ఆయనంటే అంత క్రేజ్ ఉంది. అలాంటి అభిమానం కొందరికి మాత్రమే సొంతమవుతుంది. ఆయన కూడా అభిమానులను అలానే చూసుకుంటారు. పవన్ సార్ తో కలిసి వర్క్ చేసేటప్పుడు నేను ప్రత్యక్షంగా చూశాను. కలిసిన అందరితో బాగా మాట్లాడతారు. ‘హరిహర వీరమల్లు’కు వర్క్ చేసే సమయంలో చాలా మంది నా దగ్గరకు వచ్చి ‘మీరు మా దేవుడితో వర్క్ చేస్తున్నారు’ అని అనేవారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటారు. దేనికోసమైనా వందశాతం కష్టపడతారు. ఎలాంటి విషయాన్నైనా ధైర్యంగా చెబుతారు. నిజాయతీగా ఉంటారు. అందుకే సినిమాలతో సంబంధం లేకుండా ప్రజలు ఆయన్ని ఇష్టపడతారు. భవిష్యత్తులో ఆయన ప్రధాని అయినా నేను ఆశ్చర్యపడను” అని నిధి అగర్వాల్ చెప్పుకొచ్చింది. కాగా హరి హర వీరమల్లు తర్వాత ప్రభాస్ తో కలిసి ది రాజాసాబ్ సినిమాలో కథానాయికగా నటించింది నిధి అగర్వాల్. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది.



## అషికాకు బంపర్ ఆఫర్ ?

కన్నడ కస్తూరి అషికా రంగనాథ్ నిదానంగా తెలుగులోనూ బిజీ అవుతున్నది. నాగార్జున ‘నా సామిరంగ’ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అందాలభామ.. రీసెంట్‌గా రవితేజ ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’తో తెలుగు తెరపై సందడి చేసింది. చిరంజీవి ‘విశ్వంభర’లోనూ కీలక పాత్ర పోషించింది. ఈ సినిమా సమ్మర్‌లో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇదిలావుంటే.. ఈ అందాలరాశి డైరీలోకి మరో ప్రస్టేజియస్ సినిమా వచ్చి చేరిందనే టాక్ ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నది. శర్వానంద్ కథానాయకుడిగా శ్రీనువైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాలో అషికా హీరోయిన్‌గా ఎంపికైందట. ఈ ఏడాది మార్చి నుంచి ఈ సినిమా షూటింగ్ మొదలు కానున్నట్టు తెలిసింది. ఈ సంక్రాంతికి ‘నారీ నారీ నడుమ మురారి’తో గ్రాండ్ విక్టరీని అందుకున్నారు హీరో శర్వా. తెలుగులో ఇప్పటివరకూ సీనియర్ హీరోలతో జతకట్టిన అషికా తొలిసారి యంగ్ స్టార్ శర్వానంద్‌తో జతకట్టనుండటం విశేషం. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సివుంది.

## తెలంగాణ సాయుధ పోరాటంలో ‘గొల్ల రామవ్వ’..




దివంగత భారత మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహారావు రాసిన కథల్లో ఒకటి గొల్ల రామవ్వ. తెలంగాణ సాయుధ పోరాట గాథ నేపథ్యంలో సాగే ఈ స్టోరీ సిల్వర్ స్క్రీన్‌పైకి రాబోతుంది. పాపులర్ రైటర్, ప్రొడ్యూసర్, దివంగత ముళ్లపూడి వెంకటరమణ కుమారుడు వర ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్నాడు.

భయం పోయినప్పుడు ధైర్యం మొదలవుతుంది.. ప్రతిఘటన, ఆశ చుట్టూ తిరిగే శక్తివంతమైన కథ.. అంటూ తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం ఈటీవీ విన్‌లో ఈ నెల 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, హిందీ, మలయాళం, ఒడియా భాషల్లో సూపర్ పాపులారిటీ సంపాదించుకున్న తల్లూరి రామేశ్వరి ఈ చిత్రంలో టైటిల్ రోల్ పోషిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. రజాకార్ల దాష్టికానికి తెలంగాణ ప్రాంతం వణికిపోతున్న కాలంలో ఓ పల్లెలో జరిగే కథ ఇది. కథాసుధలో భాగంగా 30 నిమిషాల రన్‌టైంతో సాగే ఈ ప్రాజెక్ట్ సాయుధ పోరాట యోధుడిని రక్షించడంలో గొల్ల రామవ్వ ఎలాంటి త్యాగానికి సిద్ధపడిందనే నేపథ్యంలో సాగనుంది. ఈ ప్రాజెక్టుకు సాయి మధుకర్ సంగీతం అందిస్తుండగా.. అజహర్ షేక్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**